తలపుల మలుపులు

"సుందరం, నీ వాచ్చావేమిట్రా ఇవాళ ?"

"అత్తయ్య సాయంత్రం టిఫిన్ తీసుకువస్తానంది. భోజనం కారియరు తీసుకు వెళ్ళమంది. మామయ్యా, కులాసా ?"

కనుబొమలు ముడిచాడు సదాశివం. ముఖం చిట్లించాడు.

"ఈ కారియరు తను తీసుకురాలేకపోయిందా ?" సణుక్కుంటూ అవతలకి తిరిగి పడుకున్నాడు.

"అత్తయ్య తలంటి పోసుకోవాలట. మధ్యాహ్నం బజారుకు వెళ్ళి సరుకులు తెచ్చుకోవాలిట" మంచం దగ్గరగా ఉన్న స్టూలుమీద కూర్చున్నాడు సుందరం.

"ఊఁహూఁ....ఇంకా ఏమేమి చెయ్యాలట" సుందరం వైపు తలతిప్పి కళ్ళు చిట్లిస్తూ అడిగాడు.

"ఏమో ? నాతో చెప్పింది ఇంతే" మామయ్యకు కోపం వచ్చిందంటే. పొట్టి వాదులు వస్తాయి.

"సుందరం....ఇవాళ ఎన్నో తేదిరా ?" టీచరు విద్యార్థిని నిలబెట్టి ప్రశ్నించినట్లు ప్రశ్నిస్తున్నాడు.

"పద్దెనిమిది మామయ్యా" తల వంచుకునే జవాబిస్తున్నాడు సుందరం.

'అయితే యివాళ సరుకులు కొనటమేమిట్రా ? చెప్పేవాడికి చెవుడయితే వినేవాడికి వివేకం లేదా అన్నట్టుంది మీ ఇద్దరి సంగతి."

"ఆదేమీ నాకు తెలియదు మామయ్యా. అత్తయ్య చెప్పమన్న మాట నీకు చెప్పాను. నీవు తొందరగా భోజనం చేస్తే కారియరు తీసుకు పోతాను."

చురుక్కున చూశాడు సదాశివం. "అలా చెయ్యమని అత్తయ్య చెప్పిందా?"

"అబ్బే! అత్తయ్య అలా చెప్పలేదు. నీవు భోజనం చేస్తే తీసుకు పోదామనుకున్నానంతే. పరీక్షలు దగ్గరకి వస్తున్నాయి కదా? ఇంటికి వెళ్ళి చదువుకోవాలి" నీళ్ళు నమిలినట్లు నమిలాడు.

"అంతేనా?"

"అంతే మామయ్యా!"

'ఒరే సుందరం. అమ్మను ఒకసారి రమ్మని ఉత్తరం రాయి; చూడాలని వుంది" మంచమ్మీద లేచి కూర్చున్నాడు సదాశివం.

"మొన్ననే కదా మామయ్యా, అమ్మ వచ్చి వెళ్ళింది! ఇంతలోనే మళ్ళీ ఎందుకు?"

చికాకేసింది సదాశివానికి. భార్యగాని మేనల్లుడుగాని చెప్పినట్లు చెయ్యకూడదూ? సవాలక్ష ఎదురు ప్రశ్నలువేసి తనను విసిగించేస్తున్నారు.

"ఒరే సుందరం? నేను రాయమన్నానని రాయి నువ్వు?"

"లేవ లేపా అమ్మ ఇక్కడకి వస్తుంటే నాన్న ఒక్కరూ ఇంట్లోవుండద్దా మామయ్యా? ఆయనకు ఒంట్లో అంత బాగుదటం లేదు కదా?"

ఆ మాటకి తగ్గినట్లు కనబడ్డాడు సదాశివం. "అదీ నిజమే–కానీ–సుందరం? మళ్ళీ అందరిని చూస్తానో చూడనో ననిపిస్తోందిరా–నాకున్న రక్త సంబంధీకు రాలల్లా మా అక్కయ్య ఒకతే సుందరం? నేనింక ఎన్నాళ్ళో బ్రతకనురా ఇవాళే అమ్మకు ఒక కార్డు రాస్తావు కదూ!" దీనంగా ముఖం పెట్టాడు సదాశివం.

"నీకంత అధైర్యం ఎందుకు కలుగుతోంది మామయ్యా? నీకు పూర్తిగా నయమైపోతోందని డాక్టరు చెప్పారు అసలు మనం చాలా తొందరగా కనుక్కున్నాం. వెంటనే నీవు శానిటోరియంలో చేరావు. నాలుగు నెలలనుంచీ మందు

తీసుకుంటున్నావు. పుష్టికరమైన ఆహారం తింటున్నావు. ఖరీదయిన మందులే వాడుతున్నాము. వైద్యోపచారాలలో ఏమీ లోపంలేదు-డాక్టరు నీ అభివృద్ధి తృప్తికరంగా ఉందని అంటున్నాడు ఇంకా నీ కెందుకూ అధైర్యం?'' సుందరం కొద్దిగా ధైర్యం తెచ్చుకుని మేనమామకు ధైర్యం చెప్పబోయాడు.

మళ్ళీ మంచమ్మీద లేచి కూర్చొని క్రాపు చేతి వేళ్ళతో వెనక్కు తోసుకుంటూ ''ఒరేయ్ సుందరం! అవన్నీ డాక్టర్లు రోగితోటి రోగి బంధువులతోటి చెప్పే మాటలురా. ఒకసారి క్షయ వచ్చిందంటే ఇంక ఆ మనిషి ఖర్చయిపోయాడన్న మాటే. ఇవాళ కాకపోతే రేపయినా'' ముఖమ్మీద స్వేదబిందువులు పొటమరించాయి, ఆ మాటలు అనేటప్పుడు సదాశివానికి.

సుందరం ఇరవయి ఏళ్లు నిండీ నిండనివాడు. చదువులో కొంచం ఆలస్యమైంది-సుందరం చదువు మాన్పించినందుకు అక్కను మందలించి సుందరాన్ని తన దగ్గరకు తీసుకువచ్చి చదువు కొనసాగింప చేశాడు. సదాశివం ఇప్పుడు బి. ఏ. రెండవ సంవత్సరంలో ఉన్నాడు. మేనమామ అంటే కాస్త భయం. అత్తయ్య దగ్గర కొద్దిగా చనువు.

'మామయ్యా. నీవనుకునేది వెనుకటిమాట, ఆ రోజుల్లో నీ వన్నట్లు ఈ జబ్బు వస్తే ఖర్చయిపోయినట్లే కాని. ఇప్పుడు? అన్ని జబ్బులకూ మంచి మంచి మందులు వచ్చాయి. జబ్బులు వచ్చిన తర్వాత మందులివ్వడమే కాదు-రాకుండా కూడా ఇచ్చే మందులు కనిపెట్టారు,'' కొద్దిగా ధైర్యం తెచ్చుకుని అన్నాడు సుందరం.

'ఆఁ....మందులు కనిపెట్టే వాళ్లు కనిపెడుతున్నారు, రోగాలతో చచ్చే వాళ్లు చస్తున్నారు. రెండింటికి సంబంధంలేకుండా'' పెదవులు విరిచాడు సదాశివం.

'మామయ్యా-మనిద్దరం డాక్టర్లం కాము, మనకేం తెలుసు మందుల సంగతి; ఆ మాట ఒదిలెయ్యి. నీవు ముందు భోజనం చెయ్యి.''

''ఏమిటోరా ఇవాళ తినాలని లేదు.''

''ఏం-అన్నీ నీ కిష్టమైనవే చేసింది మామయ్యా''

"అది కాదురా....నా మంచానికి నాలుగో మంచం ఖాళీ అయింది చూశావా? అది ఇవాళ ప్రొద్దున్నే జరిగింది. డాక్టర్లు రావడం పోవటం నర్సులు వార్డుబాయిస్ హడావుడిగా ఇటుఅటు పరుగెత్తటం అంతా చూశానురా కళ్ళతో" అతడి ముఖంలో భయం కొట్టవచ్చినట్లు కనబడుతోంది.

గొల్లున నవ్వాడు సుందరం.

"అదా సంగతి—అట్లా చెప్పు అందుకా ఇలా మాట్లాడుతున్నావు. వాడికి ఆయువు మూడింది అయిపోయింది. అంతే! నీకెందు కంట అంత భయం? జబ్బు బాగా ముదిరితే మందులకు లొంగదు. అతడు బాగా ముదరబెట్టుకొని వచ్చాడేమో పాపం" విషయం మార్చాలని ప్రయత్నం చెయ్యబోయాడు.

"ఆ మాట నిజమే. ఒక ఊపిరితిత్తి పూర్తిగా పాడయిపోయిందట. రెండవదానికి కూడా వచ్చిన తరువాత ఇక్కడికి వచ్చాడు పుష్టికరమైన ఆహారం తినలేదని ఈ డాక్టర్లంతా అంటారు గానీ ఏం పెట్టి తింటాడురా పాపం వాడు?" అదే ధోరణిలో సదాశివం సాగిస్తున్నాడు.

"పోనీలే సూమయ్యా మనమేం చేస్తాం? ఎవరికర్మ వాళ్ళది. నీకేం-మహారాజులా జరిగిపోతున్నది. అన్ని విధాలా నీకు జరిపే అత్తయ్య ఉన్నది. అటువంటి ఇల్లాలు ఉంటే ఎంత జబ్బయినా ఇట్టే పోతుంది. నీకేమయిందని?" చనువుగా మందలించాడు సుందరం.

"ఒరే సుందరం! నీవు ఎన్నిచెప్పినా నేను కొత్త సంవత్సరము చూడను" దిండు తీసి గుండెల కదుముకుంటూ నైరాశ్యాన్ని వెళ్ళగ్రక్కాడు.

"అదేమిటి? డాక్టర్లు ఇంక ఇంటికి వెళ్ళవచ్చునంటుంటే కొత్త సంవత్సరం చూడకపోవట మేమిటి?" సదాశివం వింత ధోరణికి సుందరానికి ఎటూ తోచటం లేదు.

"కాదురా సుందరం! ఇది కామన్ సెన్స్‌కి సంబంధించింది డాక్టర్లు ఎప్పుడు ఇంటికి వెళ్ళమంటారో తెలుసా?"

" బాగా జబ్బు నయమయిపోయిన తరువాత."

"కాదు-కాదు మందులకు జబ్బు లొంగకపోతే-ఈ ప్రాణం ఎలాగయినా నిలచేది కాదనుకొని 'యింటికి వెళ్ళి టానిక్కులు తీసుకో. మళ్ళీ నెల కొనసారి కనబడుతూ ఉండు' అని నెట్టేస్తారు."

"అబ్బ మామయ్యా ఇంక నీతో మాట్లాడలేను. అన్నిటికీ అన్ని అపార్థాలు తీస్తున్నావు ముందు భోజనం చెయ్యి. నేను త్వరగా ఇంటికి వెళ్లాలి" లేచి నిలబడ్డాడుడు సుందరం.

"అంత తొందర కలవాడివి అత్తయ్యను పంపి నీవే ఇంట్లో ఉండలేక పోయావు?"

"ఇందాక చెప్పానుగా! అత్తయ్యకు పని ఉంది నన్ను పంపిందని?" కను బొమ్మలు కొద్దిగా ముడిచాడు సుందరం.

"అబ్బాయి నీకంత తొందరయితే-అత్తయ్య కాఫీతీసుకు వస్తుందన్నావుగా టిఫిన్ కారియర్ ఇక్కడ పెట్టి వెళ్లు. ఇది కూడా అత్తయ్యే ఇంటికి తీసుకు వస్తుం దిలే.!" నిష్ఠూరంగా మాట్లాడాడు సదాశివం

"అయితే నేను వెళ్తాను." దిగ్గున లేచి వెనక్కు తిరిగి చూడకుండా వెళ్ళి పోయాడు సుందరం. 'అత్తయ్యను తొందరగా పంపించరా' అని సదాశివం అన్న మాటలు అతడికి వినిపించలేదు.

సరిగ్గా మూడు గంటలకు కాఫీ ఫ్లాస్కు చపాతీల డబ్బా మంచినీళ్ళ సీసా పట్టుకుని పద్మ లోపలికి వచ్చింది. సదాశివం కళ్లుమూసి నట్టుంటే మంచానికి దగ్గరగా ఉన్న కుర్చీలో కూర్చుని తను తీసుకువచ్చిన బుట్ట స్టూలు మీద పెట్టింది.

ఆ చప్పుడికి సదాశివం కళ్ళు తెరచి చూశాడు. పద్మను చూడగానే అతని కళ్ల మిల మిల్లాడాయి. పొడి పొడిగా ఉన్న తల వెంట్రుకలు చెవుల మీదకు జారుతున్నాయి. కోపం కొద్ది కనుబొమలు కలుసుకుంటున్నాయి. కొనదేరిన ముక్కు ముడుచుకుపోయి వెక్కిరిస్తున్నట్టుంది. దొండపండు లాంటి పెదవుల అణచి పెడుతుంటే అన్నం నీళ్ళు లేకుండా ఆమె ముఖారవిందాన్ని అలా చూస్తూ ఉండి పోవాలనిపించింది.

ఆ మాటే పైకి అనేశాడు.

"అన్నం నీళ్ళు లేకుండా ఓ మనిషి ముఖాన్ని అదేపనిగా చూస్తూ ఉంటే అసహ్యం పుడుతుంది. కడుపునిండా తిని చూస్తుంటే సంతోషంగా వుంటుంది. ఇందాక సుందరం చెప్పాడు–మీరు మధ్యాహ్నం భోజనం చెయ్యలేదని, ఇప్పుడు వడ్డించనా?" అంది పద్మ. అతడి ముఖం వైపు చూడకుండా.

సదాశివం కడుపులో ఏదో కుత కుత ఉడుకుతున్నట్లుగా ఉంది. అది పొంగింది.

"ఎందుకూ ఇప్పుడా చల్లారిపోయిన అన్నం?" కనుబొమలు ముడిచాడు.

"ఎట్లా చల్లారిపోతుందండీ హాట్ టిఫిన్‌లో పెట్టిన అన్నం?"

"అది ఒకవేళ వేడిగా వున్నా నాకు వద్దు"

కారణం లేని కోపం-అలక-మొండితనం చూస్తే పద్మకు అయోమయంగా ఉంది. అతడికి వచ్చిన జబ్బును గురించి ఆమె పడే బాధ కాకుండా అతడు పడుతున్న చికాకు తోటి ఆమెకు ఏం చేయాలో తెలియక కన్నీళ్ళు వస్తున్నాయి. ఆ నిస్సహాయతతో అతడిని ఎదురు ప్రశ్నించుతోంది తెగించి.

"ఎందుకువద్దూ? అంతా నార్మల్‌గా ఉంటే భోజనం ఎందుకువద్దు? చెప్పండి ఎందుకని?"

"తినాలని లేదు అంతే." విరుపుగా అనేసి పక్కకు తిరిగి పడుకున్నాడు.

అతడిని తన వైపుకు మళ్ళించి "చూడండీ ముందు ఓవల్‌టిన్ తాగండి. ఒక గంట పేపయినా తరువాత భోజనం చేయండి. ఈ చిన్న ఫ్లాస్కులో వున్న కాఫీ రాత్రి చపాతీలతో తీసుకోవచ్చు. సరేనా?" గడ్డం పట్టుకుని బ్రతిమిలాడింది.

దిగ్గున లేచి కూర్చున్నాడు. "నాకీ వెధవ ఓవల్‌టిన్ ఎందుకు తెచ్చావు స్ట్రాంగ్ కాఫీ తీసుకురాక?"

పద్మకు నవ్వొచ్చింది. కాఫీకి బదులు తను ఎప్పుడూ ఓవల్‌టిన్ పంపిస్తున్న మాట నిజమే. డాక్టర్లు పాలు ఎక్కువగా తాగమంటున్నారు. అతడు కాఫీ–అందులో స్ట్రాంగ్‌కాఫీ తాగుతా నంటాడు. చిన్న పిల్లవాడిలా మారాం చేస్తాడు.

కాని అతడిని తను చిన్న పిల్లవాడిలా చూడలేకుండా ఉంది. పసిపిల్లవాడిని సముదాయించినట్లు సముదాయించబోతే విదిలించి కొడతాడు. తను లోపల్లోపల కుళ్ళి, పోతూ పైకి శాంతం ఓపిక ప్రదర్శిస్తోంది.

"అదా గుసుపు? మరి.... డాక్టర్లు కాఫీ వద్దన్నారు కదా?"

"ఊఁ హుఁ, ఏమయినా సరే - నాకది వద్దు'

"అయితే ఒక పని చేయండి. ఇవాల్టికి ఈ ఓవల్‌టిన్ తాగేయండి. రేపటి నుంచి తీసుకురాను. మరి గ్లాసులో పోసి ఇవ్వనా?"

"ఊఁ హూ...."

"ఇంతలోకీ ఏమయిందండీ, ఇప్పుడేగా గ్లాసులో పొయ్యమన్నారు? పోసి నేను తాగించనా?"

నవ్వుతూ ఆమె ముఖంలోకి చూశాడు.

ఆమె తలమీద ఒక చెయ్యివేసి ఒక చేత్తో గ్లాసు పట్టుకుని తాగిస్తుంటే చిన్న పిల్లవాడిలా మారాం చేస్తూ తాగుతున్నాడు.

"చూశారా! ఓవల్‌టిన్ అలా కళ్ళుమూసుకుని తాగితే ఎంత మంచిదనుకున్నారు.?" అన్నది తాగించానన్న తృప్తితో.

"పద్మా?"

"ఎదురుగా ఉన్న మనిషిని అంత గట్టిగా పిలుస్తారేం?" కిల కిల నవ్వుతూ చూసింది అతని కళ్ళలోకి.

"ఏదీ నీ చెయ్యి! ఎంత ఆరోగ్యంగా వుందో చూడు? ఎలా నవ నవలాడుతుందో చూడు?" ఆమె చెయ్యి పట్టుకుని గాజులు అటు ఇటు తిప్పుతూ చూస్తున్నాడు.

"నేనేం చెయ్యను? అలా వుంది మరి" అంది నవ్వుతూ.

"అది కాదు పద్మా? నీది మంచి బలమైన పుట్టుక. మంచి దృఢమైన ఆరోగ్యం. నీవు మా యింటికి వచ్చిన తరువాత ఒక్కసారయినా జబ్బు పడలేదు. కదూ?" ఇంకా అతడి చెయ్యి ఆమె చేతిని తాకుతూ నిమురుతూనే ఉంది.

"ఇంకా నయం? నేను జబ్బుపడితే నాకెవరు చేస్తారు? ఈడ్చి అవతల పారెయ్యమంటారు" అదొక మాదిరిగా నవ్వింది.

"ఆఁ? నేనుండగా అంతమాటే అనటం?" ఆమె వీపు మీద చరిచాడు మెల్లగా.

ఆమె పళ్లు కనబడకుండా నవ్వింది. "నన్ను మంచంమీద పడుకోబెట్టి మీరు ఆ చాకిరి అంతా చెయ్యగలరా? రోగికి ఉపచారం చెయ్యటమంటే మాటలనుకున్నారా? అన్నట్టు మీకు వక్కపొడి తీసుకువచ్చానా మందమతిని!" బుట్టలో చెయ్యి పెట్టి వెతుకుతోంది.

"అయితే నాకు చెయ్యటం చాలా కష్టంగా ఉందన్నమాట నీకు? అంత కష్టపడిపోతున్నావా?" అంతలో ముఖంలో రంగులు మారాయి.

"ఛా ఛా ఆ మాటక్కాదండీ నేనన్నది? అయినా మీ కోసం నేనేం కష్టపడిపోతున్నానని? అంతా ఇక్కడే జరిగి పోతున్నది. అయినా ఇంతమాత్రం కష్టపడటం—అందులో మీ కోసం కష్టపడటం ఒక గొప్ప విషయమా? ఘనకార్యమా?" అతడు ఆ విధంగా భావించినందుకు ఆమె చాలా నొచ్చుకున్నది.

"చచ్చేవాడు చస్తుంటే చూసేవాళ్లు మేం చాలా కష్టపడిపోతున్నాం త్యాగం చేస్తున్నామంటారు. హుఁ-లోకంతీరే ఇంత! ఏమంటావు?"

ఆమెకు ఇదంతా అతడికి శారీరకమైన బాధ కాదని తెలుసు. ఇది జబ్బుపడి లేచిన వాడి లక్షణమా! అదీ అర్థం కావటంలేదు.

"నేనొకమాట చెప్తాను వింటారా?"

"ఊఁ....చెప్పు. వినటానికేం?"

"చూసేవాళ్ళు శరీరకష్టం చెయ్యగలరు. సానుభూతి చూపించగలరు. జాలిపడగలరు. కాని ఎంత ఆత్మీయులైనా ఏం చెయ్యగలరు అంతకంటే? అన్నం నీళ్ళు లేకుండా కనిపెట్టుకుని కూర్చోగలరు కాకపోతే? అంతకంటె ఏమన్నా ఉందా చెయ్యటానికి? చెప్పండి?" అతడి కళ్ళల్లోకి చూసింది.

"అవున్లే-చస్తుంటే చూస్తూ ఉంటారు. అంతేగా ఎంత చెప్పినా?" ముక్కుపుటా లెగురవేస్తూ అన్నాడు.

"ఛా ఛా-అట్లా ఎందుకనుకుంటా రండీ మీరు?" ఆమె కనురెప్పలను దాటి రెండు వెచ్చని కన్నీటిబొట్లు బుగ్గలమీదుగా జాలువారాయి.

జగచ్చక్షువు భూమిలోకి దిగేపోతున్నాడు. పోతూపోతూ వింత వెలుగును లోకమ్మీద వెదజల్లి పోతున్నాడు. ఆ కెంజాయ ఇచ్చే వీడ్కోలు ప్రతిరోజూ ఒకే విధంగా ఉండదు. నిత్యనూతనంగా ఉంటుంది.

అతడు కళ్ళు మూసుకుని పడుకున్నాడు. కాని మేలుకొనే ఉన్నాడు.

"చపాతీ తినే వేళయింది - లేవరూ?" అంతవరకూ కుర్చీమీదనే వెనక్కువాలి కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నది పద్మ. చటుక్కున గడియారం చూసుకుంది. అతడిని మెల్లగా భుజమ్మీద తట్టి లేపింది.

కళ్ళు నులుముకుంటూ లేచి "పద్మా" అన్నాడు.

"మీరు చపాతీ తినే వేళయింది. బల్లమీద పెట్టనా?"

"అది సరేగాని మనదేశంలో ముత్తయిదువు చావు చాలా పుణ్యంగా భావిస్తారు కదూ! పూలతో, పసుపు కుంకుమలతో వెళ్ళిపోవటానికి స్త్రీలు ఎంతో పుణ్యం చేసుకోవాలంటారు కదూ?" అతడి పెదవులు పైకి నవ్వుతున్నట్టు కనబడుతున్నా కళ్లు వికృతంగా చూస్తున్నాయి.

"మీరన్నమాట నిజమే కాని – అలాంటి చావు రావద్దూ అందరికీ? మీరన్నట్టు ఎంతో పుణ్యం చేసుకుంటేనేగాని అలాంటి చావు రాదు."

"మగవాడి అదృష్టం ఆడదాని చావుమీద ఆధారపడి ఉంటుంది. చాలామంది గొప్పవాళ్ళకు ముందుగానే భార్యలు పోవటం చూస్తున్నాం" అతడికి సిగరెట్లు తాగే అలవాటుంది. కాని డాక్టర్లు నిషేధించారు. అయినా అలవాటు చొప్పున కుడిచేతి రెండువేళ్ళూ పెదవులను తాకాయి.

అటువంటి సందర్భంలో పద్మకు పెదవులపైన చిరునవ్వొకటి లాస్యం చేసింది.

భార్యలుచస్తేగాని భర్తలకు అదృష్టం పట్టదంటారా ?'' అంది పెదవులు బిగించి.

''అలాగే కనబడుతోంది మరి ?'' అన్నాడు చటుక్కున.

మీరు చపాతీ తినండి, టైమయిపోయింది.''

''తింటాలే.''

డాక్టర్లు రెస్టు కావాలంటారు. మీరు ఏమేమో ఆలోచనలు చేస్తూ ఉంటారు. అలా అయితే నేను ఇంటికి వెళ్ళిపోనా ?''

''వెళ్ళు - వీడు ఇక్కడ చస్తే చస్తాడు అనుకుంటూ వెళ్ళు. ఇంటికి వెళ్ళి హాయిగా అన్నీ తిని సుఖంగా ఉండు. ఇక నీవు ఒక్కదానివేగా ఉండేది; బ్యాంకులో డబ్బుంది. వడ్డీమీద బతకినా హాయిగా బతకొచ్చు. ఒక్కమాట నిజం చెప్పు పద్మా - నీకు నేను బతకాలని ఉందా అసలు ?'' నిలదీసి అడిగినట్టు అడిగాడు ఆమెను.

''అబ్బబ్బ - ఏం మాటలవి ? నాకు కాకపోతే ఎవరికి ఉంటుంది మీరు బతకాలని ?'' ఆమె కంఠం రుద్ధమయింది.

''అదికాదు పద్మా-ఆడవాళ్ళు చాలామంది డబ్బుంటే కాలు, మొగుడెట్టా చచ్చినా ఫరవా లేదనుకుంటా రవునా కాదా ?'' దిండును పక్కకు పెట్టి తల వెంట్రుకలు సవరించుకున్నాడు

పద్మకు అతడిని ఆ సంభాషణనుండి మరల్చటం చేతకావటంలేదు. అర్థం కాక అతడివంకే విస్తుబోతున్నట్లు చూస్తోంది.

''మరొకటి పద్మా మనదేశంలో స్త్రీలు తమ పాతివ్రత్యాన్ని రుజువు చేసుకోవటం కోసం....నాలుగు మూలలా చాటటం కోసం దుర్వ్యసనాలుగల భర్తలనూ రోగాలతో తీసుకునే భర్తలనూ కోరుకుంటారు. అంతే కదూ పద్మా. మన ఆడవాళ్ళ ఆశయాలు ?'' అతడి కంఠంలో కొద్దిగా తీవ్రత హెచ్చింది.

''నేను మీతో మాట్లాడలేనండీ, మీకో నమస్కారం'' చేతులుజోడించింది.

అతడి వాక్ప్రవాహం అంతటితో ఆగలేదు.

''భార్యలకు బాగా ఓరిమి ఉందనీ, పతిసేవ బాగా చేయగలరనీ చూపించ టానికి భర్తలకు పెద్ద జబ్బు చెయ్యాలంటావు కదూ ?''

''రామ రామ నేనా మాట అన్నానా ? ఇవాళ మీరు నా మాటలకు పెడార్థాలు తీస్తున్నారు. ప్రతిమాట వక్రంగా మాట్లాడుతున్నారు'' ఆమె యింటికి వెళ్ళటాని కని ప్రయత్నించటంలో ముందు టిఫిన్ కారియరు సర్దసాగింది.

అంతలో డాక్టరు వచ్చాడు దేవుడిలా. మొదట సదాశివాన్ని కాసేపు నవ్విం చాడు. మరి కొంతసేపు హాస్యం చేశాడు. కులాసా కబుర్లు చెప్పాడు.

ఇతనికి వచ్చినంత సంతోషం కలిగింది సదాశివానికి.

సదాశివం దగ్గర రాత్రిళ్ళు ఉండటానికి సుందరం అలవాటు ప్రకారం వచ్చాడు.

ఆ సందట్లో ఇంటికి వచ్చేసింది పద్మ.

తెల్లవారేసరికి సదాశివం అక్కగారు కామమ్మ వచ్చింది. స్నానం కాఫీ కానిచ్చుకొని. నర్సింగ్‌హోముకు వెళ్ళింది. అతడి మంచమ్మీద కూర్చుని వీపు మీద చెయ్యేసింది. అక్కగానే కాకుండా చిన్నప్పటినుంచీ పెంచిన మమకారం కూడా ఉంది ఆమెకు.

''సదాశివం. నేను మొన్ననేకదా ఇక్కడినుంచి వెళ్ళింది ? అంత అర్జం టుగా రమ్మని ఉత్తరం రాయించావేమిటి ?'' అడిగింది అప్యాయంగా అక్క.

''నిన్ను చూద్దామనిపించి రామన్నాను నా ప్రాణాలు ఇంక నిలిచేటట్టు లేవు అక్కయ్యా, ఆఖరి చూపుగా అందరినీ చూద్దామనిపిస్తోంది'' అన్నాడు నిర్వి కారంగా.

''ఛా ! ఏం మాటలవి ? డాక్టర్లంతా నిన్ను హాయిగా ఇంటికి వెళ్ళమన్నా రటగా ?

''ఆఁ.... వెళ్ళమన్నారు వెళ్ళి ఇంట్లో హాయిగా చావమన్నారు.''

"ఎందుకు మాట్లాడుతావురా ఇటువంటి మాటలు? ఒకరు కాదు ఇద్దరు కాదు నలుగురు డాక్టర్లు నీ ఆరోగ్యం సంతృప్తికరంగా ఉందని రిపోర్టు యిస్తే అవేం మాటల్రా?" గట్టిగా మందలించింది.

"ఆ." అని గాఢంగా నిట్టూర్చి "సరేగాని పద్మ రాలేదేం నీతో?" చటుక్కున జ్ఞాపకం వచ్చినట్టుగా దిగ్గున లేచి కూర్చున్నాడు.

"నిన్న శనివారం కదూ? తలమీద స్నానం చేసిందట. అందుకని నిన్న నల్లా తలనొప్పిట ఇవాళ పొద్దున లేచేటప్పటికి నూటఒకటి జ్వరం. నేనింట్లో అడుగుపెట్టేసరికి మూలుగుతూ ఎదురుగా వచ్చింది"

"అలాగా? కాస్త జ్వరానికే అంత ఇదా? తగ్గడానికి ఆరునెలలు తీసుకుంటుందేమిటి?" హాస్యధోరణిలో అన్నాడు.

"ఛీ. ఛీ. నీ మాటలూ.... నీ ధోరణీను. అయినా ఇలా మారిపోయావేం? ఈ జబ్బు వచ్చినప్పటినుంచి నీ ధోరణంతా వక్రంగా తిరిగింది. పద్మనుచూసి మరీ వికటంగా మాట్లాడుతున్నావట. పాపం జ్వరం వచ్చి అది అఘోరిస్తుంటే" కామమ్మ తమ్ముడి వింత ధోరణికి ఆశ్చర్య పడిపోతూ చీవాట్లు పెట్టింది.

"అక్కయ్యా. ఈ జ్వరాలూ ఈ నొప్పులు అన్నీ ఇప్పుడే కాని, తరువాత ఇక ఉండవు. చూడు- నే చెప్పాగా?"

"అంటే?"

"అంటే ఏముంది? మనం ఎంత మందిని చూడటంలేదు? పెనిమిటి ఉన్నన్నాళ్ళూ ఈసురో మంటూ ఉన్న వాళ్ళు ఆయన పోగానే శుభ్రంగా రాయిలా తిని తిరగటం మామూలే."

ఒక మాదిరిగా నవ్వాడు.

"చూశాంలే? కాని దానికి దీనికి ఏం సంబంధం? నీవు అటువంటి మాటలింక చాలించు రేపు ప్రొద్దున ఎనిమిది గంటలకు నేనూ సుందరం టాక్సీ తీసుకు వస్తాం. సిద్ధంగా ఉండు.... ఇంటికి పోదాం" ఒక గంటసేపు కూర్చొని కబుర్లు చెప్పింది. టిఫిన్ కారియరు సుందరం పట్టుకు వస్తాడని చెప్పి ఇంటికి వచ్చింది.

మరునాడు పెందలాడే లేచి ఇంట్లో సదాశివం గదంతా శుభ్రంచేసి పక్క వేసింది కామమ్మ. ఎనిమిది గంటలకు సుందరం ఒక్కడే బయలుదేరాడు సదాశివం దగ్గరికి డాక్టర్లు వచ్చేవరకూ ఆగి బిల్లులన్నీ చెల్లించి అక్కడ పనిచేసే వాళ్ళకు అయిదూ, పదీ యిచ్చి పది గంటలకు ఇంటికి తీసుకువచ్చాడు.

సదాశివం రాగానే అలసిపోయినట్టుగా వుంటే కామమ్మ గ్లాసుతో ఓవల్‌టిన్ ఇచ్చింది. పది నిమిషాలు పడుకున్నట్టే పడుకుని లేచి "పద్మ కనబడదేం?" అని అడిగాడు.

"అడిగో ఆ గదిలో పడుకుంది. ఒళ్ళు తెలియకుండా ఉంది. వెళ్ళి పలకరించు" అంటూ అతడిని పద్మ గదిలోకి తీసుకువెళ్ళింది.

"పద్మా. సదాశివం వచ్చాడు ఇంటికి. చూశావా?" ఆమెను తట్టి లేపింది.

పద్మ కళ్ళు తెరిచింది. ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి. కాని అప్పుడే అవి మూసుకుపోవటం మొదలు పెట్టాయి బలవంతంగా కళ్ళు తెరుస్తూ 'వచ్చారా' అన్నది.

"పద్మా, ఏమిటి ఇలా పడుకున్నావా? మంచమెక్కి మనసు తీర్చుకోవాలనుకుంటున్నావా?" చురుక్కు మనేటట్టు ఒకమాట జారవిడిచాడు.

"నిన్నటి నా బాధకు తిరిగి మిమ్మల్ని చూస్తాననుకోలేదు వదినె వచ్చిన తరువాత నా భారమెంతో తగ్గింది." ఆ మాత్రం మాట్లాడినందుకు చాలా అలసినట్టయింది ఆమెకు.

అంతలో సుందరం డాక్టర్ని తీసుకు వచ్చాడు.

జ్వరం చాలా తీవ్రంగా ఉన్నట్టుంది. నిన్న నేను రాసిచ్చిన మాత్రలు తెప్పించి ఇచ్చారా?" పరీక్ష చేస్తూ అడిగాడు డాక్టరు.

"వేసుకున్నావా పద్మా? సుందరం తెచ్చిచ్చాడుగా" అన్నది కామమ్మ.

"వేసుకున్నట్టు లేదు. అన్నీ దిండుకింద పెట్టగా చూశాను" అన్నాడు సుందరం మంచానికి దగరగా నిలబడి.

"అలా అయితే నేను వచ్చి ఏం లాభం ? మందులు రాపిస్తే ఏం లాభం ? మందు తీసుకోకుండా డాక్టర్ని చూడగానే రోగాలు తగ్గుతాయా ? ఇప్పుడు ఒక ఇంజక్షన్ యిస్తాను. ఇప్పుడైనా ఆ మాత్రలు వాడటం మొదలుపెట్టండి. మళ్ళీ సాయంత్రం వచ్చి చూస్తాను" మందలించాడు డాక్టరు. అతడు సదాశివానికి బాగా తెలిసినవాడు. కుటుంబ మిత్రుడు, అప్పుడప్పుడు అతడి అవక తవక మాటలకు అతణ్ణి చీవాట్లు పెడుతూ ఉంటాడు చనువు కొద్దీ.

డాక్టరుగారూ ప్రమాదమేం లేదు కదా ? ఆతురత కొద్ది అడిగింది కామమ్మ.

"డాక్టర్. ఏమిటీ జబ్బు ? నిజంగా ప్రమాదకరమైనదా ? లేక ఉత్త జ్వరమా ?" అనుమానంగా అడిగాడు సదాశివం.

సదాశివం మాటలకు డాక్టరు ముఖం చిట్లించాడు.

"మిస్టర్ ఉత్తజ్వరాలే ప్రమాదకరమయినవిగా మార్తాయి. మీరిలా అశ్రద్ధ చేస్తుంటే. అన్నిటికంటే రోగి సహకారం ఎక్కువగా కావాలి. రోగికి బ్రతుకుమీద ఆశ ఉంటే తప్పకుండా సహకరిస్తుంది. కాని ఈమె ఏ మాత్రం సహకరించటం లేదు" అన్నాడు డాక్టరు,

అయితే మనమే బలవంతంగా ఇస్తూ ఉండాలి" అన్నది కామమ్మ.

"అక్కయ్యా జ్వరం జ్వరం అంటున్నారు కాని-మనిషి ఏమాత్రం తీసిపోలేదే ? మీరంత ఆదుర్దా పడుతున్నారెందుకో నాకర్థం కావటంలేదు" అన్నాను సదాశివం కనుబొమలు చిట్లించి.

కామమ్మకు సదాశివం మాటలు చికాకు కలిగించాయి. అన్నీ వక్రంగా మాట్లాడుతుంటే చెవులు మూసుకుంటోంది.

"ఉండరా నీ గొడవ మధ్యన ? నీ మాటలు నాకర్థం కావటంలేదు. కాసేపు అవతలుండు" విసుక్కుంది కామమ్మ.

రెండు రోజులు కామమ్మే మాత్రలు పద్మ నోట్లో వేసి మంచినీళ్ళిచ్చింది

"ఒదినా ! ఒదినా ! ఒకమారిలా రండి" పద్మ వదినగారిని పిలిచింది మూడోనాడు.

"ఏం పద్మా? నిన్నటికంటె కులాసాగా ఉందా? కొంచెం జావ చేసివ్వనా?" తల వెంట్రుకలు సర్దుతూ అడిగింది కామమ్మ.

విరక్తిగా నవ్వింది పద్మ "నిన్నటి కంటె నయమే.

కాని-ఒదినా నాకు ఎందుకు ఇంత శ్రద్ధగా మందులిచ్చి బతికిస్తున్నారు?"

"అవేం మాటలు పద్మ? నీవు ఎప్పుడు కళ్ళుతెరచి మాట్లాడతావా అని నేను ఎదురుచూస్తుంటె ఇట్లాగా నీవు మాట్లాడేది? ఎందుకిలా నీవు మాట్లాడేది? ఎందుకర్రా ఇలా మారిపోయినారు మీ ఇద్దరూ?" విచిత్రంగా చూసింది కామమ్మ.

దుఃఖం పొంగుకుంటూ వచ్చింది పద్మకు "నయమయితే నాకేమయినా సుఖమా? ఎవరికైనా సంతోషమా?"

"అదేమిటే పిచ్చిదానా! నీకు నయమయితే మాకందరికీ సంతోషం కాదూ? నీవు లేచి మాట్లాడావని సదాశివానికి చేటంత ముఖమయింది చూశావా?" కామమ్మ వింతగా పద్మను చూసింది.

పద్మకు ఏడుపు ఆగలేదు "లేదు ఒదినా లేదు. ఆయనకు జబ్బు చేసినప్పటి నుంచీ స్వభావం మారిపోయింది. ప్రతిదానికీ సాధింపు ఎక్కువయింది. మాటలతో చిత్రవధ చేసేస్తున్నారు ఎందుకు బ్రతికున్నానా అని అనిపిస్తోంది. హాయిగా పునిస్త్రీ చావు చస్తే ఎంతో పుణ్యం కూడాను" ఏడుస్తూ అంది.

"ఎవరు చెప్పారు నీకు?" గట్టిగా అరిచింది కామమ్మ.

"ఆయనే చెప్పారు" దీనంగా ఉంది పద్మ ముఖం.

"ఊరుకో పద్మా వాడేదో నవ్వులాటకని ఉంటాడు నీవు ఆ మాత్రం దానికి దిగులు పడటం బెంగ పెట్టుకోవటమూనా? అసలు జీవితంలో నైరాశ్యం తెచ్చుకోవచ్చా? వాడికి జబ్బు చేసినప్పటి నుంచీ కోపమూ, విసుగూ ఎక్కువయినట్టుంది"

"కాదు ఒదినా కాదు అది రోగులందరికీ వచ్చే సామాన్యమైన కోపం కాదు" ఎర్రబడిన ముఖాన్ని కళ్ళనూ కొంగుతో అద్దుకుంది.

"ఆఁ— కాక మరేమిటే పిచ్చిదానా?" ఆమెకు పద్మ మాటలు వింతగా వినబడుతున్నాయి.

"ఆయనకు తను చచ్చిపోతానన్న భయం పట్టుకుంది. దానితోపాటు ఆరోగ్యంగా ఉన్నవాళ్ళను చూస్తే ఒక విధమైన కోపం, కసీ రోజు రోజూ ఎక్కువ కావటం మొదలయింది. పొద్దున లేచినప్పటినుంచీ ఒకటె సాధింపు——" నేను పోయిన తరువాత చీకూ చింత లేకుండా హాయిగా ఉందామని ఉంది కదూ ?" అంటూ. ఒదినా ! నాకు తను పోయిన తరువాత అంత సుఖంగా ఉంటుందా అసలే ఆయనకీ జబ్బు వచ్చిందని నేను బాధ బాధ పడుతుంటె పైగా ఈ సాధింపులు ఇంతకంటె చస్తే నయం కదూ ?" వదినగారిని పట్టుకుని బావురుమని ఏడ్చింది పద్మ.

ఏమిటే ? ఎక్కడా వినని కబురు వినిపిస్తున్నావు ? పిలిచి నాలుగు చీవాట్లు పెట్టనా ?"

"వద్దు వదినా వద్దు మనమిప్పుడు ఏ మాట మాట్లాడినా ఆయన పెడర్థాలే తీస్తారు. లాభం లేదు" అంతలో అవతలి గదిలో అలికిడి వినిపించి ఆగింది పద్మ.

"అయితే ఏం చేద్దామంటావే మరి" కామమ్మ తల నొక్కుకుంది.

మరునాడు కామమ్మ సదాశివాన్నిచూసి "నీవు వేడినీళ్ళ స్నానం చేశావు కదూ ! ఇలా వచ్చి కూర్చో పది గంటలు కాగానే అన్నం పెడతాను" అప్యాయంగా పిలిచింది.

"అక్కయ్యా నీ చేతి పథ్యం తిన్న తరువాత ప్రాణం లేచి వచ్చినట్లయింది. ఇక్కడే కొన్నాళ్ళు వుండిపోకూడదూ ?" ప్రాధేయపడ్డాడు

"ఉండటానికేంరా ? వుంటాను కాని ఇంట్లో ఇబ్బంది. నీవు లేచి తిరుగుతున్నావుగా, ఇంకెందుకు చెప్పు ?" అతడి ముఖంలోని మార్పులు చూడాలని ప్రయత్నిస్తోంది.

"అక్కయ్యా ! ఒక్కమాట. పద్మ సంగతేమిటి ? డాక్టరేమన్నాడు ?" విసుగ్గా ప్రశ్నించాడు.

"ఆయన చెప్పటమెందుకురా ? నీకు కనబడటంలేదూ ? మనిషిని చూస్తే ఏమనిపిస్తున్నదని" మందలించినట్టుగా అంది.

"నామటుకు నాకు జబ్బుగా ఉన్న మనిషిలా అనిపించటం లేదు" పెదవులు విరుస్తూ అన్నాడు.

"అదేమిట్రా ? పదిహేను రోజులనుండి లంఖణాలు చేస్తుంటే నీకేం కనబడటం లేదూ ? మంచానికి అంటుకు పోతేనూ ?" చీవాట్లు పెట్టింది.

"ఆ.... నిజంగా అన్ని లంఖణాలు చేసినదే అయితే ఈపాటికి ప్రమాదం చేసి ఉండాలి కాని-అలా జరగలేదే ?"

"అలా జరగాలని ఉందా నీకు ? ఏం మాటలివి ? నీ బుద్ధి ఇలావ క్రించి పోతోందేం ? ఆ జ్వరానికి ఉన్న గడువు తీరితేగాని తగ్గిపోదు, నీ పిచ్చిమాటలు తగ్గించి మామూలుగా మాట్లాడు"

ఆమెను వెన్నంటి వంట యింట్లోకి వెళ్ళాడు "అంత జ్వరం వచ్చిందంటున్నావు. అన్ని లంఖణాలు చేసిందంటున్నావు. కాని పద్మ మాట్లాడుతూ మంచమ్మీదనే ఉంది. ఎట్లా నమ్మమంటావు ?"

"ఇంక చాల్లేరా నీ కబుర్లూ నీవూను" ఆమె వంటపని చూసుకోవటం మొదలు పెట్టింది.

సదాశివం ధోరణిలో ఈ మధ్య మార్పు వచ్చింది. ఎవరయినా పలుకరిస్తే ఉలిక్కిపడి అప్పటికప్పుడు ఈ లోకంలోకి వచ్చినట్టుంటాడు. అతడికి ఇప్పుడిప్పుడే ఓపిక వస్తున్నట్టుగా ఉంది. అయినా పద్మ కంటె తను బలహీనంగా ఉన్నాననుకుంటాడు. ఆనాడు పద్మను చూస్తే ఎక్కడలేని కసీ కనబరుస్తున్నారు.

వారం రోజుల తరువాత డాక్టరు వచ్చి సదాశివాన్ని బాగా పరీక్షచేసి "మీరు పూర్తిగా కోలుకున్నారు. విశ్రాంతి కూడా బాగానే తీసుకున్నారు. ఇంక మీరు ఉద్యోగంలో చేరవచ్చు" అన్నాడు.

సదాశివానికి అప్పుడే నీరసంతో తల వాలి పోయినట్లయింది. "ఇంకా సత్తువ రాలేదనిపిస్తోంది డాక్టరుగారూ ! ఉద్యోగంలో చేరిన మూడోనాడే మళ్ళీ మంచం ఎక్కాను కదా ?"

డాక్టరు నవ్వాడు "అదంతా మీ భయం మీకు ఇప్పుడు ఏ మాత్రం బలహీనత లేదు. హాయిగా ఉన్నారు మీ తూకం కూడా పెరిగింది. ఇలాగే పుష్టికరమయిన ఆహారం తీసుకోండి."

సదాశివానికి మనసులో భయం, సవాలక్ష సందేహాలు "డాక్టరుగారూ ఒక్కొక్కప్పుడు నాకు మానసికంగా ఒక విధమయిన ఒక విధమయిన డిప్రెషన్ వస్తుందండీ" బాధతో మూలుగుతూ అన్నట్టు అన్నాడు.

"అయితే-అలా వచ్చినప్పుడు మీకేమనిపిస్తుంది? దానికి కారణం కనబడటం లేదే!"

"ఏదో నిస్పృహ కలుగుతూ ఉంటుంది డాక్టరుగారూ! అలా నీరసం వచ్చినప్పుడు ఒక విధమైన ఉద్రేకంకూడా వచ్చినట్టుంది అయోమయంగా ఉంటుంది"

డాక్టరు పగలబడి నవ్వాడు. అతడితోపాటు సుందరంకూడా నవ్వాడు.

"చూడండి మిస్టర్ - మేము రోగులను ఎంతో మందిని చూసి ఉంటాం కదా. పుస్తకాలల్లో రాసిన దానికంటే అనేక రకాల నగ్న సత్యాలను చూస్తాం. ఇది కేవలం అనుభవం మీద చూస్తేనే తెలుస్తుంది. కొందరు రోగులకు కోలుకుంటున్నా సరే, చావు భయమెక్కువ. ఆ భయంతోపాటు ఆరోగ్యంగా ఉన్నవాళ్ళను చూడగానే తమకా ఆరోగ్యం లేదని అసూయగా మంటగా ఉంటుంది. ఎవరిని చూసినా చికాకు-ఏది చూసినా చికాకుగా ఉంటుంది. అంతేనా? ఇలాంటిదేనా మీ బాధ?"

"సరిగ్గా అట్లాకాదు గాని ఎవరిని చూసినా ఏదో చికాకుగా ఉంటుందండి" అన్నాడు సదాశివం.

"అదేలెండి నేను చెబుతున్నాగా ఎంతోమందిని చూశానని? కొంతమందికి జబ్బు చెయ్యగానే చిర చిరలు వస్తాయి."

డాక్టరు మెల్లగా కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు

"మీరనేదంతా పిల్లల విషయంలో ననుకుంటా" సదాశివానికి తెలుస్తోంది — ఇదంతా తన సంగతి కాదు కదా అన్న అనుమానం కూడా వస్తోంది.

డాక్టరు ముఖంలో కొంచెం ఆవేశం కనబడ్డది. "పిల్లలకు కాదు - పెద్దలకు కూడా ఉంటుంది. చివరకు అది ఎంతవరకూ వస్తుందంటే-ఎవరికయినా జబ్బు చేస్తే "ఇంకా చావరే" మనిపిస్తుంది. ఈ లక్షణాలన్నీ జబ్బు నయమయిన తరువాత కోలుకునేటప్పుడు కొందరు రోగులలో కలుగుతాయి" ముఖం రుమాలుతో తుడుచుకున్నాడు డాక్టరు.

ఉలిక్కిపడ్డాడు సదాశివం.

"డాక్టరుగారూ! నా సంగతి చెప్పాడు. నేను వుద్యోగంలో చేరిపోతాను. కాని మా పద్మ సంగతేమిటి!" సదాశివం తల వంచుకునే అడిగాడు.

ఈ ప్రశ్నకోసమే. ఎదురు చూస్తున్నాడు డాక్టరు. ఘాటుగా జవాబివ్వాలనుకున్నాడు.

"మిస్టర్ మీరు చదువుకున్నారు. ఈ పాటికి గ్రహించుకున్నారనుకున్నాను. ఇందాకటినుంచి నేను చెబుతున్నదంతా అక్షరాలా మీపట్ల నిజమని ఋజావు చేసుకున్నారు. మీ మనసులో మార్పు వస్తేనేగాని ఆమె ఆరోగ్యం కోలుకోదు. మీ సూటిపోటీ మాటలు ఆమెను కోలుకోనివ్వటంలేదు. మీకేం ప్రాణ భయంలేదు ఆమెను కూడా బ్రతకనివ్వండి. అసలే ఆమెది సున్నితమైన మనసు" ఆవేశంతో అన్నాడు డాక్టరు.

"అదేమిటి నా మీద అంత పెద్ద అభాండ వేస్తున్నారు! నా భార్యకు త్వరగా నయం కావాలని నాకు ఉండదా!" కొంచెం తీవ్రంగా అన్నాడు సదాశివం.

"ఉండాల్సిందే. అలా వుండటమే ఆరోగ్యం లక్షణం మిత్రమూ, నాదొక చిన్న సలహా. మీ అక్కగారు ఎలాగూ వెళ్ళిపోతానంటున్నారు. మీరూ సుందరం ఇక్కడుండి, ఆమెను మీ అక్కగారితో పంపండి. ఒక నెలరోజులు చాలు, ఇది మీరవశ్యంగా తీసుకోవలసినమందు చాలాసేవయింది. నా నర్సింగ్ హోంలో మీలాంటి రోగులకు ఇలాంటి మందులు బలవంతంగా మింగించాల్సి వుంది. మరి వెళ్లాను" లేచాడు డాక్టరు.

"అసలే రోగిష్టివాడిని, నా కింతచేసి పెట్టకుండా ఆమెను పంపించేస్తే ఎలా డాక్టర అదిరిపడ్డాడు సదాశివం

''మిస్టర్ నేను డాక్టర్‌ని. ఏ రోగానికే మందివ్వాలో నాకు బాగా తెలుసు. నేను చెప్పినట్టు మీరిద్దరూ వినాల్సిందే'' లేచి గబ గబా అడుగులు వేస్తూ వెళ్ళి కారులో కూర్చున్నాడు.

మరునాడు పద్మ సామాను సర్దుకొని బండెక్కుతుంటే వీధి వాకిట్లోకయినా రాలేదు. సదాశివం. అతడి కడుపులో తాటాకు మంటలాంటిది భగభగ మండు తున్నది.

(జయశ్రీ - సంక్రాంతి సంచిక)